సాక్షి కామారెడ్డి

మంగళవారం । 25 ఫిబ్రవరి । 2025



మెనూ ప్రకారం భోజనం..

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 8లో ▸



టోల్ వసూలు చేస్తే..

టోల్ గేట్ సమీపంలోని గ్రామాలకు చెందిన వాహనాలకు టోల్ చార్జీ వసూలు చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.8 /14.6

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'బ్యాంకు కేసుల పరిష్కారానికి కృషి చేయాలి'



కామారెడ్డి టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుంటూ బ్యాంకు కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి సూచించారు. వచ్చేనెల 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విషయమై న్యాయమూర్తి సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేసుల పరిష్కారం కోసం తగిన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

బీకేఎస్ జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం



కామారెడ్డి రూరల్: భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జాతీయ అధ్యక్షుడు కొండెల సాయిరెడ్డి సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఆయనకు రైతులు, బీకేఎస్ నేతలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి పెద్ద అంజన్న, జోనల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, నాయకులు రాజేశం, శంకర్‌రావు, సాయిలు పాల్గొన్నారు.

'ఓట్లను పునరుద్ధరించాలి'



కామారెడ్డి టౌన్/కామారెడ్డిఅర్బన్ : జిల్లాలోని ప్రయివేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ లెక్చరర్ల ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఓట్లను తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు ఫిర్యాదుతో వందలాది పట్టభద్రులైన ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఫిర్యాదుపై విచారణ జరపకుండానే ఏకపక్షంగా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి తొలగించిన ఓట్లను పునరుద్ధరించి ఓటు హక్కును కల్పించాలని కోరారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు బాలు, ప్రతినిధులు నరేందర్ గౌడ్, భీమా గౌడ్, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

కామారెడ్డి టౌన్ : ఎస్సెస్సీ విద్యార్థులకు సంబంధించిన అంతర్గత మార్కులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెలాఖరులోపు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని డీఈవో రాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచిన అనంతరం స్థానిక ఎంఈవోల ద్వారా ధ్రువీకరించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వచ్చేనెల ఒకటిన సమర్పించాలన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



గాంధారి(ఎల్లారెడ్డి): వచ్చేనెల 5 వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో పరీక్షల గురించి మాట్లాడారు. ఈసారి పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయని, జాగ్రత్తగా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బందితో సమావేశమయ్యారు. అధ్యాపకులు తమ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని పేర్కొన్నారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

నగరంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పట్టభద్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు





అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పట్టభద్రులూ..

ఆలోచించి ఓటేయండి

- ఎమ్మెల్సీ అభ్యర్థులే దొరకని బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌ను ఓడించాలనడమేమిటి ?
- మరి ఎవరిని గెలిపించాలో ఆ పార్టీ చెప్పాలి
- ప్రజలు తిరస్కరించినా కుట్రలు మానని కేసీఆర్
- బీఆర్‌ఎస్‌కు రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హత ఉందా..
- ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనసభ ఎన్నికల్లో ప్రజల తిరస్కారానికి గురై, లోక్‌సభ ఎన్నికల్లో గుండుసున్నాతో డిపాజిట్లు కోల్పోయి, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టలేని బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఓడించాలని చెబుతోంది.. మరి ఓటు ఎవరికి వేయాలని చెబుతున్నారని అడుగుతున్నా. బీఆర్‌ఎస్ పార్టీకి రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హత ఉందా? అని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన, కీలక పాత్ర పోషించిన పట్టభద్రులు ఈ విషయమై ఆలోచన చేయాలని ఆయన కోరారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ఏం చేసిందో గమనించాలన్నారు. కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో పడుకోమని జనం పంపారని, ప్రజలు తిరస్కరించినప్పటికీ కుట్రలు మానలేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో ఎన్నికైన ప్రజాప్రభుత్వాన్ని బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఉద్యోగ నోటిఫికేషన్లు అరకొరగా ఇచ్చినప్పటికీ కోచింగ్ సెంటర్లతో కుమ్మక్కై, కోర్టు కేసులు వేయించి నిరుద్యోగులతో ఆటలాడుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అశోక్‌నగర్, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేవలం ఏడాది లోపే 51,163 మందికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేశామన్నారు. ఇక 35 వేల మంది టీచర్ల బదిలీలు, 22 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామన్నారు.

పట్టభద్రుల కోసం ప్రధానితో కొట్లాడుతా..

తాము చెప్పేవి అబద్ధాలైతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవతలివారికి ఓటేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ పార్టీ తరఫున నిలబడిన నరేందర్‌రెడ్డిని గెలిపించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. తుపాకీ గుండుకు సైతం దొరకనివారిని ఓడించాలన్నారు. నరేందర్‌రెడ్డి ఓడితే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదన్నారు. తాను ఒక్క గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానన్నారు. పట్టభద్రుల కోసం ప్రధాని మోదీతోనైనా కొట్లాడతానన్నారు.

ఏటా రూ.75 వేల కోట్ల వడ్డీ చెల్లింపు..

మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పగిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7.11 లక్షల కోట్ల అప్పు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కేసీఆర్ చేసిన అప్పుకు ఏడాదికి రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల బకాయిలు ఇచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 12 గంటల్లో సమగ్ర కుటుంబ సర్వే చేసి బీసీలు 51 శాతమే ఉన్నట్లు చూపగా, తాము కచ్చితమైన సర్వే చేసి బీసీలు 56.33 శాతం ఉన్నట్లు తేల్చామన్నారు. తీరా ఇప్పుడు లెక్క తప్పు అంటూ బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సొల్లు వాగుడు వాగుతున్నారన్నారు. మైనారిటీలు 12.56 శాతంగా తేల్చామన్నారు. ఇందులో 10.08 శాతం బీసీలున్నారన్నారు. కులగణనపై బండి సంజయ్ భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారన్నారు. బీజేపీ పాలిత గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ముస్లింలు బీసీ రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ కృష్ణ మాదిగను కౌగిలించుకుని సమస్యను మాత్రం పరిష్కరించలేదన్నారు. 12 ఏళ్ల మోదీ, 10 ఏళ్ల కేసీఆర్ పాలన చూడాలని పిలుపునిచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పాత్రధారులు ప్రభాకర్ రావు, శ్రవణ్‌రావులను అమెరికా నుంచి తీసుకురాకుండా బండి సంజయ్ బీఆర్‌ఎస్‌తో బేరం పెట్టుకున్నారన్నారు. రాష్ట్రానికి ప్రాజెక్టులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారన్నారు.

వారధిగా ఉంటా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానన్నారు. తనపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతున్న కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమ్మేళనంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్, లక్ష్మీకాంతారావు, నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, నిజామాబాద్, కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్, అన్వేష్ రెడ్డి, కాసుల బాలరాజు, ఈరవత్రి అనిల్, తాహెర్, ఐకే రెడ్డి, వేణుగోపాలచారి, శ్రీహరిరావు, శేఖర్‌గౌడ్, వినయ్‌రెడ్డి, రమేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, మార గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరుతున్న రేవంత్‌రెడ్డి

ఏటీసీలుగా ఐటీఐలు

రూ.2,100 కోట్లు వెచ్చించి, టాటా కంపెనీతో కలిసి ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చామని, టాటాలో ఉద్యోగాలిచ్చేలా ఒప్పందం చేసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే మహీంద్రా గ్రూప్‌తో కలిసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పెట్టి ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా చేశామన్నారు. మంచి కంపెనీలవారిని డైరెక్టర్లుగా పెట్టామన్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు తీసుకురావాలనే లక్ష్యంతో గ్రామీణ క్రీడాకారులను, మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల నగదు, డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామన్నారు. ఇంటర్ మాత్రమే చదివిన క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామన్నారు. పారా ఒలింపిక్స్‌లో పతకం తెచ్చిన కీర్తికి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చామన్నారు. పంజాబ్, హర్యానా రైతులతో పోటీపడే నిజామాబాద్ రైతుల ఉద్యమంలో పాల్గొన్న తనకు పీసీసీ పదవి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, సన్నధాన్యానికి బోనస్ ఇచ్చామన్నారు.



వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావు తదితరులు

ఇంకా ఫ్రీజింగ్‌లోనే బల్దియా ఖాతాలు

- రాష్ట్ర ఐటీ అధికారులకు నివేదిక
- 18 ఏళ్ల ఐటీ వివరాలు పరిశీలిస్తున్న అకౌంట్స్ విభాగం అధికారులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా ఖాతాలు ఇంకా ఫ్రీజింగ్‌లోనే ఉన్నాయి. 18 ఏళ్లకు సంబంధించిన ఆదాయపు పన్ను బకాయిలు పేరుకుపోవడంతో ఐటీ శాఖ వారం క్రితం కామారెడ్డి బల్దియా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో సోమవారం బల్దియా అకౌంట్స్ విభాగం అధికారులు హైదరాబాద్‌కు వెళ్లి ఆదాయపు పన్ను శాఖ అధికారులను కలిసి నివేదికలు సమర్పించారు. ఆర్థిక లావాదేవీలకు ఆటంకం కలగకుండా చూసేందుకు ఫ్రీజింగ్ ఎత్తేయాలని కోరారు.

వివరాలు లేక..

కామారెడ్డి బల్దియాకు సంబంధించి 2007–08 నుంచి ఆదాయపు పన్నులు పెండింగ్‌లో ఉన్నాయని ఐటీ డిపార్ట్‌మెంట్ పేర్కొంటోంది. సుమారు రూ. 39 లక్షల వరకు బకాయి ఉన్నట్లు నోటీసుల్లో పేర్కొంది. అయితే దీనికి సంబంధించిన వివరాలు బల్దియా అధికారుల వద్ద అందుబాటులో లేవని తెలుస్తోంది. ప్రస్తుత అకౌంట్స్ విభాగం అధికారులకు, సిబ్బందికి వాటి వివరాలపై అవగాహన లేదు. ఈ క్రమంలో కార్యాలయంలోని పాత ఫైళ్లను వెతికే పనిలో నిమగ్నమయ్యారు. వివరాలు లభించకపోవడంతో మరో వారం వరకు కూడా ఖాతాలపై ఫ్రీజింగ్ కొనసాగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

వేతనాలు చెల్లించేదెలా?

బల్దియా ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేయడంతో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. కాగా మరో నాలుగు రోజుల్లో కార్మికులు, ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఖాతాలు ఫ్రీజ్ కావడంతో వారి వేతనాలను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక బల్దియా అధికారులు తలలుపట్టుకుంటున్నారు. ఈ విషయమై కమిషనర్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా విషయాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమస్య త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మోసం చేయడమే కాంగ్రెస్ మోడల్

- తెలంగాణ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే ఎన్నికలివి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు



న్యాయవాదులతో సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

కామారెడ్డి టౌన్ : ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలను మోసం చేయడమే మోడల్‌గా పెట్టుకుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయడానికి బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులే దిక్కులేరన్నారు. బీజేపీ గెలుపు కోసమే బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలపలేదని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. మిగతా రెండు స్థానాలలో తమ పార్టీ అభ్యర్థులను ఎందుకు నిలపలేదో చెప్పాలన్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం కావడంతో ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ మిగతా రెండు స్థానాలలో అభ్యర్థులను నిలపలేదన్నారు. హామీలపైనుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రోజుకొక మాట మాట్లాడుతున్నారన్నారు. అనుభవం లేని సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు కష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే ఎన్నికలన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించి, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పట్టభద్రులు, టీచర్లను కోరారు.

న్యాయవాదులతో ముఖాముఖి

జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ భవనంలో డీకే అరుణ న్యాయవాదులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయవాదులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. దేశ ప్రజల సంక్షేమం కోసం, మహిళల రక్షణ కోసం మోదీ ప్రభుత్వం చట్టాల్లో మార్పులు తీసుకోస్తోందన్నారు. అనంతరం గ్రంథాలయం అవరణలో పట్టభద్రులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, నాయకులు అరుణతార, నరేందర్‌రెడ్డి, గంగారెడ్డి, కుంట లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, రవీందర్‌రావు, రాజేశ్వర్, నంది వేణు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ఎస్సెస్సీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఆదర్శ, సంక్షేమ పాఠశాలల ప్రిన్సిపల్స్, కేజీబీవీల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లల్ని దత్తత తీసుకొని ఫలితాలను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్లో తప్పనిసరిగా స్నాక్స్ ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బలరాం, డీసీఈబీ కార్యదర్శి లింగం, విద్యాశాఖ సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్, వెంకటరమణారావు, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త డైట్ మెనూను అమలు చేయాలి

ప్రభుత్వం ప్రకటించిన కొత్త డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కూరగాయలు, పప్పు దినుసులు, బియ్యం లాంటి అన్ని సరుకులు నాణ్యతతో కూడినవి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రత్యేక అధికారులు తనిఖీ చేశాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రజిత, స్రవంతి, దయానంద్, ఫుడ్ సేఫ్టీ అధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఓటేసేందుకు వెసులుబాటు కల్పించాలి

కామారెడ్డి క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు విధుల్లో వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈనెల 27 న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర అన్ని రకాల సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులు, కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని సూచించారు. విధుల సమయంలో సర్దుబాటు, తక్కువ పని గంటలు కేటాయించడం లాంటివి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తూ ఓటు హక్కు కలిగి ఉన్న పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించామని పేర్కొన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు

కామారెడ్డి క్రైం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోడం కోసం కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు, రాజకీయ నాయకులు



నిజామాబాద్ జిల్లా కేంద్ర శివారులోని ఓ గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, వేదికపై టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్, కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్ తదితరులు

క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్: అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత' వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకొని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన ర్యాలీలు, వినియోగదారులతో ఆర్థిక అక్షరాస్యత సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీణ్, మెప్మా పీడీ రాజేందర్, అభిజిత్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం



నిజాంసాగర్ (జుక్కల్): మండలంలోని అచ్చంపేట ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి భూయర్ ఓంకార్ అదృశ్యమయ్యాడు. ఈ నెల 22 నుంచి కనిపించకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సమాచారం అందించారు. ఓంకార్ ఇంటికి రాలేదని చెప్పడంతో సోమవారం గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జడ్డు జనార్దన్ ఫిర్యాదు చేసినట్లు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు.

'కబ్జా'పై విచారణ



మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ శివారులో ప్రభుత్వ భూమి కబ్జాపై అధికారులు సోమవారం విచారణ ప్రారంభించారు. సర్వే నంబర్ 61లో పానుగంటి గంగారెడ్డి అనే వ్యక్తి కొంత ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నాడని ఈ నెల 22న మాజీ కార్పొరేటర్ రాయ్‌సింగ్ తహసీల్దార్ శేఖర్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన నిజామాబాద్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, తహసీల్దార్ శేఖర్ సోమవారం కబ్జా అయిన స్థలాన్ని పరిశీలించారు. కబ్జాదారుడి వద్ద ఉన్న భూమికి సంబంధించి పత్రాల్లో సర్వే నంబర్ 62 అని ఉండగా, సర్వే నంబర్ 61లోని భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. దీంతో టీపీవో అనుపమ, ఆర్‌ఐ షఫీ, సర్వేయర్ కిషన్ నాయక్‌లు కబ్జాదారుడు గంగారెడ్డిపై మండిపడ్డారు. దీంతో జాతీయ రహదారికి పొడవునా అన్నీ కబ్జాలే ఉన్నాయని ముందు వాటిని వెలికితీసి తన జోలికి రావాలంటూ కబ్జాదారుడు అధికారులతో వాదనకు దిగారు. ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో గతంలో ఓసారి సదరు వ్యక్తిని హెచ్చరించి, కబ్జా నుండి వెళ్లగొట్టినట్లు ఇరిగేషన్ ఏఈ దివ్యభారతి వెల్లడించారు. తదుపరి విచారణ జరిగే వరకు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని కబ్జాదారుడికి చెప్పారు. విచారణలో మాజీ కార్పొరేటర్ రాయ్‌సింగ్, మాణిక్‌బండార్ గ్రామస్తులు ప్రభు, నర్సాగౌడ్, వినోద్‌కుమార్ ఉన్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా..

మాణిక్‌బండార్ శివారులో జాతీయ రహదారి పక్కన సర్వేనంబర్ 61లో కొంత ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తి ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకు దిగుతాడనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇదే శివారులో తనకు ఉన్న రెండు ఎకరాల భూమి వద్ద కొంత, దాస్‌నగర్ కూడలి వద్ద మరికొంత ప్రభుత్వ భూమిని కబ్జాచేసి తన ఆధీనంలో తీసుకున్నాడనే విమర్శలున్నాయి. సదరు వ్యక్తి చేసిన కబ్జాలపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హరహర శంభో



విద్యుత్‌కాంతులతో వెలిగిపోతున్న నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం



విద్యుత్ దీపాలంకరణలో శంభులింగేశ్వరాలయం

- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు
- ఉపవాసాలతో మహాశివుడిని కొలిచేందుకు సిద్ధమైన భక్తులు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్‌కాంతుల వెలుగుల్లో శివాలయాలు

నిజామాబాద్ రూరల్: మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. శివునికి ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రసిద్ధ శివాలయాలను అందంగా ముస్తాబు చేశారు. నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, శంభుని గుడి, మనోకామేశ్వరాలయం, బోధన్‌లోని శ్రీచక్రేశ్వరాలయం, ఆర్మూర్ నవనాథసిద్ధుల గుట్ట, బాల్కొండ ఖిల్లాపై ఉన్న శివాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నలుమూల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ కమిటీలు, దేవాదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నాయి. శివాలయాల్లో ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు పూజాది కార్యక్రమాలు, జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బాల్కొండ 'ఖిల్లా' శివుడు



బాల్కొండ ఖిల్లాలోని లింగం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని పురాతన ఖిల్లాలో ఉన్న శివుడు శివరాత్రి సందర్భంగా భక్తుల పూజలందుకోనున్నాడు. బాల్కొండను క్రీ.శ 1422లో బహమనీ సుల్తాన్‌లు పాలించిన సమయంలో ఖిల్లాలో పెద్ద రాతిపై స్వయంభు లింగం వెలిసినట్లు చరిత్ర చెబుతోంది. లింగానికి ఎలాంటి ఆలయం లేకపోయినా.. బండరాయి శేషును తల్పం మాదిరి ఉండి, దాని కింద లింగం ఉంది. సాధారణంగా శివాలయంలో లింగం ఎదుట నందీశ్వరుడు ఉంటాడు. కానీ ఇక్కడ గుర్రం ఉంది. ఇది ఇతర శివలింగాలకు భిన్నమని, బాల్కొండను ఏలిన చివరి రాజు ఖాజా అతిఉల్లా హుస్సేనీ కూతురు సైదానాభీ నిత్యం ఈ శివలింగాన్ని పూజించేదని చరిత్రకారులు చెబుతున్నారు.

అపురూపం 'శ్రీ చక్రేశ్వర శివాలయం'





మహా శివరాత్రి సందర్భంగా ముస్తాబైన శ్రీ చక్రేశ్వర శివాలయ ప్రాంగణం

బోధన్‌రూరల్: ఒకప్పటి బహుధాన్యపురం నేటి బోధన్‌లో పరశురాముని చే నిర్మింపబడి మట్టికోటను చదును చేస్తుండగా బయట పడిన అపురూపమైన శ్రీ చక్రేశ్వర శివాలయం భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత ఆలయం ప్రసిద్ధి చెందుతోంది. ఏకచక్రపురంలో వెలిసిన ఆలయం కావడంతో అప్పటి నుంచి 'ఏకచక్రేశ్వర ఆలయం' గా పిలుస్తున్నారు. సముద్రం నుంచి తీసుకొచ్చిన సాలాగ్రామం శిలతో శివలింగాన్ని తయారుచేసి చక్రేశ్వరాలయంలో ప్రతిష్ఠించారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు, ఆలయ కమిటీ, దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. 26న తెల్లవారుజామున 4గంటల నుంచి గర్భాలయ ధర్మ దర్శనం, అభిషేకాలు, రాత్రి 9గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

ఏర్పాట్లు చేశాం



శివరాత్రిని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులు సహకరించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలి.

– రాములు, కార్యనిర్వహణ అధికారి

వైఫల్యాలను ఎండగట్టే వారికే పట్టం కట్టాలి



లింగంపేటలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, పక్కన మాజీ ఎంపీ బీబీపాటిల్

- బీజేపీ ఎంపీ డీకే అరుణ

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె లింగంపేటలో ఓటర్లనుద్దేశించి మాట్లాడారు. శాసన మండలికి బీజేపీ ఎమ్మెల్సీలను పంపిస్తే ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక పనులను అడ్డుకొని ప్రజలకు మేలు చేసే విధంగా పోరాడుతారని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను విద్యార్థులు, విద్యావంతులు మర్చిపోలేదన్నారు. ఉపాధ్యాయుల నుంచి మల్కా కొమరయ్య, గ్రాడ్యుమేట్ నుంచి అంజిరెడ్డికి తమ విలువైన ఓటు మొదటి ప్రాధాన్యతగా వేసి గెలిపించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు, మాజీ ఎంపీ బీబీపాటిల్, జిల్లా మాజీ అధ్యక్షులు అరుణతార, జిల్లా ఎమ్మెల్సీ ఇన్‌చార్జి గంగారెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేశాయి

ఎల్లారెడ్డి: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలని మోసం చేశాయని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఎల్లారెడ్డి బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటి వరకు 5 డీఏలను ఇవ్వలేదని, ప్రజలకిచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిది అనుభవం లేని పాలన అని విమర్శించారు. ఆదాయ పన్నులో మినహాయింపు ఇచ్చింది బీజేపీ సర్కార్ అని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి హైమారెడ్డి, నాయకులు దేవేందర్, బాలకిషన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పట్టభద్రుల ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం బిచ్కుంద బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో బిచ్కుంద, జుక్కల్, మద్నూర్ మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి అత్యధికంగా ఓట్లు వేయించి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు. నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, నాగ్‌నాథ్ పటేల్, గంగాధర్, వెంకట్‌రెడ్డి, సాయాగౌడ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



విద్యార్థులతో భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. సోమవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. తహసీల్దార్ సవాయిసింగ్, ఎంపీడీవో అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకే మద్దతు



బాన్సువాడ: బీఆర్‌ఎస్ నేతలు కేసుల నుంచి తప్పించుకునేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, బీఆర్‌ఎస్–బీజేపీ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త పొన్న కైలాస్ నేత ఆరోపించారు. బాన్సువాడలో పోచారం స్వగృహంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి మోసం చేసిన బీజేపీకి ఓట్లేస్తారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో 50 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ఏడాదిలో 56 వేల ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. బీసీ సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.900 కోట్లు కేటాయించిందని తెలిపారు. అల్ఫోర్స్ విద్యా సంస్థలను నెలకొల్పి వేల మందిని విద్యావంతులుగా తయారు చేసిన విద్యావేత్త నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రులకు మేలు జరుగుతుందని అన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, నార్ల రవీందర్, ఎజాస్, రాయిస్, పిట్ల శ్రీధర్ తదితరులున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



బీబీపేటలో తండ్రికి తలకొరివి పెడుతున్న కూతురు భార్గవి

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన కమ్మరి కృష్ణమూర్తి (55) వృత్తి రీత్యా కమ్మరి పనులు చేస్తుండేవాడు. సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. కృష్ణమూర్తికి కుమారులు లేకపోవడంతో కూతురు భార్గవి తండ్రికి తలకొరివి పెట్టింది. దీంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు.

ఆఖరి మజిలీకి తప్పని తిప్పలు



పంట పొలాల మీదుగా పోచయ్య అంతిమయాత్ర నిర్వహిస్తున్న బంధువులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చిన్నఆత్మకూర్‌లో ఆఖరి మజిలీకి అవస్థలు తప్పేదెప్పుడో తెలియడం లేదు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి అంతిమయాత్రకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన మంగలి పోచయ్య(65) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించారు. శ్మశానవాటికకు సరైన దారి లేకపోవడంతో పంట పొలాలలో నుంచి పాడెను మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ శివారులోని శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోకపోయింది. ఇప్పటికైనా పరిష్కారం చూపాలని చిన్న ఆత్మకూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి బాలుడు మృతి



ఇందల్వాయి: పశువులను మేపేందుకు వెళ్లి చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన లోలం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలం బేల్య తండాకి చెందిన బావత్ చిన్నా(16) తండ్రి రాములతో కలిసి పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. తండ్రి గమనించకపోవడంతో నీటమునిగి చిన్నా చనిపోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోటగిరి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని బాపూనగర్ గ్రామానికి చెందిన కట్కూరి రాములు(40) అశోక్‌సాగర్‌లో సోమవారం శవమై తేలాడు. వివరాలు ఇలా.. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాములు.. తిరిగి రాకపోవడంతో భార్య నాగజ్యోతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అశోక్‌సాగర్ గ్రామస్తుల సమాచారంతో ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, రాములు మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే రాములు అశోక్‌సాగర్‌లో పడినట్లు భార్య నాగజ్యోతి ఫిర్యాదులో పేర్కొంది. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

సుంకెట్‌లో ఈతవనం దగ్ధం

- కాలిపోయిన 800 ఈత చెట్లు
- రూ.10లక్షల మేర నష్టం



సుంకెట్‌లో దగ్ధమైన ఈత వనం

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని సుంకెట్‌లో ఈత వనం అగ్నికి ఆహుతి అయ్యింది. ప్రమాదమో లేక ఎవరైనా గిట్టనివారి కుట్రనో తెలియదు కానీ సుమారు 800ల ఈత చెట్లు సోమవారం కాలిపోయాయి. ఒక్కో చెట్టు ద్వారా ఆదాయం వచ్చే మార్గం మూసుకపోయి రూ.10లక్షల వరకు నష్టం ఏర్పడినట్లు గీతా పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు తెలిపారు. బీడు భూములు, వ్యవసాయ క్షేత్రాల్లోని ఈత చెట్లు అంతరించడంతో గీత కార్మికులు తమకున్న మూడున్నర ఎకరాల భూమిలో ఈతవనాన్ని అభివృద్ధి చేశారు. ఇటీవలే కల్లు గీయడం కోసం చెట్లను సైతం సిద్ధం చేశారు. ఈతవనం దగ్ధంపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుంకెట్ గీత కార్మికుల సంఘం ప్రతినిధులు ఎక్సైజ్ సీఐ గుండప్పకు ఫిర్యాదు చేశారు.

ఆటోనగర్‌లో కత్తులతో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ నయా బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. తన బంధువైన మహిళను వేధిస్తున్నారని సాద్ ఫారూఖీ అనే వ్యక్తి ముగ్గురు స్నేహితులతో కలిసి నయా బ్రిడ్జికి చెందిన అక్బర్ ఇంటికి వెళ్లాడు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో అక్బర్ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి ఫారూఖీపై దాడి చేశాడు. తీవ్ర గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రుద్రూర్: వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోస్రా మండలం గోవూర్ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. టీవీఎస్ వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా బోధన్ మండలం భవానీపేట్ గ్రామానికి చెందిన మాగిరి లింగారాం (58)గా భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



నిజామాబాద్ అర్బన్: ఎలక్షన్ కోడ్ తరువాత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తామని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో సోమవారం టీజీవో నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టీజీవో జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అలుక కిషన్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో టీజీవో ఉద్యోగులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రావు, దేవీసింగ్, స్వామి, రామస్వామి, గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక వేలం

మాచారెడ్డి: లచ్చాపేట శివారులో సీజ్‌చేసిన 10 ట్రాక్టర్ల ఇసుకకు సోమవారం తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన గాండ్ల వినోద్ రూ.19వేలకు ఇసుకను దక్కించుకున్నారు. డీటీ భిక్షపతి, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ పాల్గొన్నారు.